[illegible] 20-7-45

# ఆడపిల్లల పెళ్ళిళ్ళు ★

శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు

మనదేశంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళ సమస్య రానురాను చాలా క్లిష్టంగా తయారయింది. సార్దా చట్టంకూడా ఈ సమస్య పరిష్కారం కావటానికేమాత్రమూ తోడ్పడుతున్నట్టు కనిపించదు. నిజానికి సార్దాచట్టం ఒక సమస్యని పరిష్కరించేటందుకు పెట్టినదికాదు; అతి బాల్య వివాహాలవల్ల కలిగే దురన్యాయంచూసి సహించలేనివాళ్ళ అంతరాత్మలకు కొంచం ఉపశాంతి కలిగేటందుకు పెట్టినది. అందువల్ల సార్దాచట్టం నిరుపయోగమైనదని కాదు; దాని ప్రయోజనాన్ని పూర్తిగా పొందేటందుకు అవసరమైన పద్ధతుల్ని సంఘం—ముఖ్యంగా తెలుగుసంఘం—అవలంబించలేదు. అందుకు హరవిలాస సార్దాగారు బాధ్యులుకారు.

క్రియకు తెలుగుదేశంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు వాయిదా పెళ్ళిళ్ళు (delayed marriages) గా తయారయినాయి గాని సంస్కారం పొందిన పెళ్ళిళ్ళకింద జమకాలేదు. వెనకటి రోజుల్లో పిల్లకు త్వరలో పెళ్ళి చెయ్యకపోతే ఎక్కడ రజస్వలా అయిపోతుందో అని తల్లిదండ్రులు తహతహలాడేవారు. రజస్వలానంతర వివాహాలొచ్చినాక కూడా ఈ తల్లిదండ్రుల తహతహ అట్లాగే ఉంది! ఆ రోజుల్లో ఆడపిల్లలు అభం శుభం ఎరగని స్థితిలో భార్యాత్వంమీద వేసుకునేవారు గనుక వాళ్ళకి భర్తల్ని వెదికే బాధ్యత తల్లిదండ్రులపై ఉండేది. మరి ఈనాడున్నూ పిల్లలకి భర్తల్ని తల్లిదండ్రులే వెదుకుతున్నారు! పాతికేళ్ళు వచ్చిన కుమార్తెలకు సహితం మొగుళ్ళని వెదికే తల్లిదండ్రుల పాట్లు చూస్తుంటే వీళ్ళకి వివాహం గురించి అభిప్రాయాలేమీ మారలేదని మనకి స్పష్టంగా తెలుస్తుంది. ఈ తల్లిదండ్రుల్ని నేనడుగుతున్నాను. మీ పిల్లల మొగుళ్ళని మీరెందుకు వెదుకుతారు? మీ పిల్లల్నే ఎందుకు వెదుక్కోనివ్వరు?

"మా పిల్లలకి మొగుళ్ళని వెదుక్కునే అవకాశంలేదు," అంటారు. అవకాశం ఎందుకివ్వరు?

"వాళ్ళకి చాతకాదు," అంటారు. ఎందుకు నేర్పరు?

అంతేనా? మా పిల్లని మీ అబ్బాయికి చేసుకుంటారా అని మీరు వెళ్ళి వరుడి తల్లిదండ్రులని అడిగితే వాళ్లు నిర్మొహమాటంగా "కట్నం ఏమిస్తారు?" అని అడుగుతారు.

అదే మీ పిల్ల వెళ్ళి వాళ్ళ అబ్బాయిని అడిగితే ఆ అబ్బాయికి కట్నం విషయం అడిగేదమ్ముంటుందా? ఒకవేళ అబ్బాయి, "మీ నాన్న నాకేం కట్నం ఇస్తాడు? అని అడిగితే, "మా నాన్నకేమిటి సంబంధం?" అని పిల్ల అడగదా?

మగపిల్లవాడికి కావాలిసింది భార్య—కట్నంకాదు. మగపిల్లలూ, ఆడపిల్లలూ పెళ్ళిళ్ళ విషయం తమలో తాము తేల్చుకునే రోజేవస్తే కట్నాల సమస్యే ఉండదు. మనం వాళ్లకు ఒకళ్లనొకరు కోరుకునే అవకాశం ఇవ్వటంలేదు. అటువంటి అవకాశం ఉండినచోట పెళ్ళిళ్ళు వధూవరుల ఇష్టప్రకారమే ఇప్పుడున్నూ జరుగుతూ ఉన్నాయి.

ప్రతి ఆడపిల్లా వెళ్ళి ఎవరో ఒక పిల్లవాణ్ణి, "నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అని అడగాలని నా తాత్పర్యం కాదు. మగపిల్లవాడయేది, ఆడపిల్ల అయేది తనకు ఒక మనిషి గట్టిగా కావాలని తోచినప్పుడు ముందు అడక్క తప్పదు. ఈ విషయంలో మగపిల్లలకీ ఆడపిల్లలకీ మనం సమానమైన అవకాశాలిస్తే నూటికి తొంభైసార్లు మగపిల్లలే ఆడపిల్లల్ని అడగటం జరుగుతుంది. అటువంటప్పుడు ప్రస్తుత స్థితిలో ఆడపిల్లల తండ్రులే మగపిల్లల వేటకి జాస్తిగా బయలుదేరటం చాలా తలకిందులు ఏర్పాటు. ఈ విధంగా ఆడపిల్లలు పెళ్ళిళ్ళ మార్కెట్‌లో అతిచౌక అయిపోయి, వాళ్ళ వెంట వేలకువేలు కట్నాలు తూకం పెట్టవలసి వస్తున్నది.

సంఘంలో ఈ ఏర్పాటు అంతమై పెళ్ళిళ్ళు సక్రమంగా జరగాలంటే పెద్దవాళ్లలో జరగవలసిన మానసిక పరివర్తన బోలెడంత ఉన్నది. పిల్లలు భార్యలనుగాని భర్తలనుగాని సంపాదించుకునే భారం తమమీదే ఉందని చిన్నతనంనుంచే





http://www.maganti.org/

స్పష్టంగా తెలుసుకునేటట్టు చెయ్యాలి. వయసువచ్చిన పిల్లలు ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకోవటమే రంకనే పిచ్చి అభిప్రాయాలు వాళ్ల తలలో పెట్టక వాళ్లు ఒకరితో ఒకరు స్వేచ్ఛగా పరిచయం చేసుకునే అవకాశం ఇవ్వాలి. రంకుతనం హేయమైనదని నమ్మించగలిగితే పిల్లలుకూడా పెద్దవాళ్లంత నీతిగానూ ఉండగలరు. పెద్దవాళ్లం స్వేచ్ఛగా పరస్త్రీలతోనూ, పరపురుషులతోనూ మాట్లాడుతున్నాం కాదూ? ఆ పరిచయం రంకుతనానికి దారితీస్తున్నదా? అదంతా వట్టి చాదస్తం. పెద్దవాళ్ల కన్న పిల్లలకి ఆత్మగౌరవంగాని శరీరాభిమానంగాని తక్కువ ఉంటుందనుకోవటానికి ఆధారం లేదు. ఆమాటకొస్తే నీతిలో వాళ్లకుండే విశ్వాసం పెద్దవాళ్లకుండదు.

వాళ్లంతట వాళ్లు చేసుకునే పెళ్ళిళ్ళు ఆదర్శప్రాయంగా ఉంటాయనికూడా నా అభిప్రాయం కాదు. అసలు ఆదర్శప్రాయమైన పెళ్లంటూ ఉండదు. ఒకపిల్ల తన భర్తను ఎన్నుకునేటప్పుడు తనకు లభ్యమయే వాళ్లందరిలోకీ ఉత్తముణ్ణే ఎన్నుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఒకవేళ తన లోటుపాట్లు చప్పున తెలుసుకోక తనకుమించిన భర్తని సంపాయించటానికి ప్రయత్నించినట్టయితే ఆ ప్రయత్నాలు విఫలం కావటంవల్ల ఆత్మజ్ఞానం కలిగే అవకాశం ఉంది. మరొకళ్లు చేసే పెళ్ళిలో, ఇది సాధ్యంకాదు. సామాన్యంగా మధ్యమ తరగతి ఆడపిల్లల తల్లిదండ్రులు మొదట్లో కొండలకి వెంట్రుకలు కడతారు. ఆఖరుకు తమరిచ్చే కట్నానికి తగిన భర్తగాలేదనే అభిప్రాయం బాగా ఏర్పడిపోతుంది. ఈ చిక్కు సొంతాన చేసుకునే పెళ్ళిళ్ళకుండదు. ఏ కారణం చేతనైనా ఒక పిల్ల, "ఇంతకంటె తక్కువవాణ్ణి నేను చేసుకోను," అని పట్టుపట్టినప్పుడు తన కోరిక సఫలం చేసుకునేటందుకు పిల్ల విశ్వప్రయత్నం చెయ్యటానికీ ఫలించని పక్షంలో అవివాహితగా ఉండిపోవటానికీ అవకాశం ఇవ్వటం ధర్మం.

నా పెళ్ళి మరొకరు చేసేకన్న నేను చేసుకోవటం నాకూ సంఘానికీ శ్రేయస్కరమని ఈనాడు రుజువు చెయ్యటానికి పూనుకోవటం అనవసరం. భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని రుజువుచెయ్యటం లాగుంటుంది. కాని దురదృష్టవశాత్తూ ఎక్కువమంది తల్లిదండ్రులింత పరమసత్యాన్నికూడా గ్రహించక, పిల్లల్ని చదివించక, వాళ్ల పెళ్ళిళ్ళ భారం తమమీదే వేసుకుని నిద్రాహారాలు లేక ఆఖరికి ఏదోవిధంగా పెళ్ళిచేసి కొంపలు గుల్లలు చేసుకుంటూ, తీరా తమ కూతుళ్ళకి చక్కని పెళ్ళిళ్ళు చేశామనే తృప్తి అయినా పొందలేని దుస్థితిలో ఉన్నారు. ఇది శోచనీయం. ఈ పరిస్థితులు మార్చటానికి బుద్ధిమంతులైనవాళ్లు మార్గదర్శకులుగా ఉండి తమ ఆడపిల్లలకి విజ్ఞానమూ, బాధ్యతా, ఆత్మవిశ్వాసమూ, తృప్తికరమైన వివాహాలూ కలిగిస్తారని నమ్ముతున్నాను. ఇటువంటి మార్పు ప్రస్తుతం ప్రత్యేకించి ఆడపిల్లల తల్లులలో రావలిసి ఉంది.





http://www.maganti.org/

Source: Press Academy Website, Andhra Mahila Magazine – July 1945

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan